
andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.7। కనిష్ఠం 22.4



విద్యార్థులకు పొదుపుపై అవగాహన

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 28 : సోన్ మండలంలోని జాఫ్రాపూర్ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం పొదుపుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కడ్తాల్ దక్కన్ గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఉదయ్‌శ్రీ మాట్లాడుతూ.. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బ్యాంకింగ్ సేవలు, ఇన్సూరెన్స్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు తోడిశెట్టి పరమేశ్వర్‌తో పాటు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫోకస్




- జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సస్పెన్షన్
- డిప్యూటీ తహసీల్దార్‌పైనా సర్కారు వేటు
- మిల్లింగ్, విధుల్లో నిర్లక్ష్యంపై సీరియస్
- మరికొంత మంది అధికారులు, సిబ్బందిపైనా వేటుకు రంగం సిద్ధం
- రైస్ మిల్లర్లపైనా కొరడా ఝుళిపించేందుకు కార్యాచరణ
- కలెక్టర్, అదనపు కలెక్టర్‌ల క్రియాశీలక చర్యలు



సీఎంఆర్ బియ్యాన్ని మిల్లింగ్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

సీఎంఆర్ అవకతవకలపై.. ఉక్కుపాదం!



సీఎంఆర్ బియ్యాన్ని నిల్వ చేసిన ఉంచిన దృశ్యం (ఫైల్)

నిర్మల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి)

గత కొంతకాలం నుంచి సీఎంఆర్ వ్యవహారంలో భారీ ఎత్తున జరుగుతున్న అవకతవకలపై కొత్తగా అధికారంలోకి వచ్చిన సర్కారు కన్నెర్ర చేసింది. ఇప్పటికే సీఎం ఆర్ అక్రమాలపై విజిలెన్స్‌తో పాటు ఉన్నతాధికారులతో విచారణలు జరుపుతున్న ప్రభుత్వం.. తన దూకుడును మరింతపెంచింది. ఇందులో భాగంగానే జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఆడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్‌లు తమ విచారణ నివేదికలను సర్కారుకు అందించారు. ఈ నివేదికల ఆధారంగా ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎస్‌కే మహమూద్ అలీని సంబంధిత శాఖ కమిషనర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ వ్యవహారం పౌర సరఫరాల శాఖను కుదిపేస్తోంది. మూడు రోజుల క్రితం వెలువడిన ఈ సస్పెన్షన్ ఉత్తర్వులు.. మిగతా జిల్లాల్లోని అధికారులను కూడా కలవరపెడుతున్నాయి. అలాగే జిల్లా పౌర సరఫరాల శాఖకు సం బంధించిన డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ బాబును కూడా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సస్పెన్షన్‌చేస్తూ ఉత్తర్వులు వెలువరించారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆశిష్ సంగ్వాన్ సీఎంఆర్ వ్యవహారంలో రైస్ మిల్లర్ల తీరు, సంబంధిత అధికారుల ఉదాసీన వైఖరి, వారి వ్యవహార శైలిపై సీరియస్‌గానే ఉన్నారు. చాలాసార్లు పలు రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవలే రెండు రైస్‌మిల్లులపై కేసులు కూడా నమోదు చేయించారు. క్షేత్ర స్థాయిలో అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్ ఎప్పటికప్పుడు ప్రాథమికంగా తనిఖీలు చేస్తూ కలెక్టర్‌కు నివేదికలు అందిస్తున్నారు. ఈ నివేదికల ఆధారంగానే కలెక్టర్ వరుసగా ఇటు సంబంధిత అధికారులతోనూ.. అటు రైస్‌మిల్లర్లతోనూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ సీఎంఆర్ జాప్యం నివారణ విషయంలో దిశా నిర్దేశం చేస్తున్నారు. అయితే మొత్తం సీఎంఆర్ వ్యవహారాన్ని తన భుజాలపై వేసుకొని ముందుకు నడిపించే జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి తన విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని కలెక్టర్ సీరియస్‌గా తీసుకున్నారు. సదరు పౌర సరఫరాల శాఖ అధికారి కీలక సమయంలో కొంతకాలంగా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడం, అలాగే సెలవు గడువు ముగిసిన విధుల్లో చేరకుండా మళ్లీ గడువును పొడగించుకోవడం వంటి వ్యవహారాలు కొనసాగించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. జిల్లా కలెక్టర్ సైతం హెచ్చరించినప్పటికీ.. సదరు అధికారి తన తీరును మార్చుకోకపోవడం సంబంధిత శాఖలో చర్చకు తావిచ్చింది. ఈ అధికారి తీరు కారణంగా సంబంధిత శాఖలో సమన్వయం సైతం లోపించినట్లు చెబుతున్నారు. ఇలాంటి వ్యవహారాలను సీరి యస్‌గా తీసుకున్న కలెక్టర్ వాస్తవ పరిస్థితులను ప్రభుత్వానికి నివేదించారు. దీంతో పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీసీఎస్‌ఓను సస్పెండ్ చేయగా.. డిప్యూటీ తహసీల్దార్‌ను కలెక్టర్ సస్పెండ్ చేసి ప్రభుత్వ చర్యల తీవ్రతను వెల్లడించారు.

• 2022-2023 సంవత్సరంలో 80శాతం పూర్తి

2022-2023 ఖరీఫ్ సంవత్సరంలో సీఎంఆర్‌కు సంబంధించి 80శాతం టార్గెట్ పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మొత్తం లక్షా 68వేల 177 ఎంటీఎస్‌ల ధాన్యాన్ని కొనుగోలు చేయగా.. దీనికి సంబంధించి రైస్ మిల్లర్లు 1లక్ష12వేల985ఎంటీఎస్‌ల బియ్యాన్ని సీఎంఆర్ రూపంలో ప్రభుత్వానికి అందించాల్సి ఉంది. ఇప్పటివరకు రైస్‌మిల్లర్లు 88వేల919ఎంటీఎస్‌ల సీఎంఆర్ బియ్యాన్ని సర్కారుకు అప్పజెప్పగా.. ఇంకా 24,066 వేల ఎంటీఎస్‌ల సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. కాగా ప్రభుత్వం సీఎంఆర్ బియ్యం చెల్లింపునకు ఈ నెల 29న గడువు విధించిన సంగతి తెలిసిందే. అయితే ఈ సీఎంఆర్ బియ్యాన్ని వెంటనే అప్పజెప్పాలంటూ అధికారులు రైస్‌మిల్లర్లకు తాఖీదులు సైతం జారీచేశారు. టార్గెట్ పూర్తి కోసం అధికారులు రైస్‌మిల్లర్లపై ఒత్తిడిలు తీసుకువస్తున్నప్పటికీ.. పరిస్థితుల్లో మాత్రం మార్పు లేకపోవడం గమనార్హం.

• 'రబీ' సీఎంఆర్ విషయంలోనూ నిర్లక్ష్యం

2022-2023 రబీ సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ విషయంలోనూ ఇప్పటికీ అడుగడుగునా నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తోంది. మొత్తం లక్షా 58వేల 566 ఎంటీఎస్‌ల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. దీనికి సంబంధించి లక్షా 6వేల831 ఎంటీఎస్‌ల సీఎంఆర్ బియ్యాన్ని రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు కేవలం 4097 ఎంటీఎస్‌ల సీఎంఆర్ బియ్యాన్ని మాత్రమే ప్రభుత్వానికి అప్పగించడం.. సంబంధిత శాఖలోనూ, సర్కారులో నూ చర్చకు తావిస్తోంది. ఈ వ్యవహారం పౌరసరఫరాల శాఖ పనితీరుపై కూడా ప్రభావం చూపించిందంటున్నారు. కొంతమంది రైస్‌మిల్లర్లు పెద్దఎత్తున అవకతవకలకు పాల్పడుతున్న కారణంగా సీఎంఆర్‌లో గందరగోళం ఏర్పడుతోందని అంటున్నారు.

• 2023-2024 ఖరీఫ్ పైనా సందిగ్ధత

2023-2024 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ విషయంలో సందిగ్ధ పరిస్థితులు నెలకొంటున్నాయి. రైస్‌మిల్లర్ల నిర్వాకం కారణంగా టార్గెట్ విషయంలో పూర్తి వైఫల్యం కనిపిస్తోందని అంటున్నారు. మొత్తం ఈసారి ఖరీఫ్ సీజన్‌లో 1లక్ష42వేల759 ఎంటీఎస్‌ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అయితే దీనికి సంబంధించి 95వేల648 ఎంటీఎస్‌ల సీఎంఆర్ బియ్యాన్ని రైస్‌మిల్లర్లు ప్రభుత్వానికి అందించాల్సి ఉంది. అయితే ప్రభుత్వం ఇప్పటికే పలుసార్లు గడువు విధించినప్పటికీ.. రైస్‌మిల్లర్లు సీఎంఆర్ విషయంలో చేతులు ఎత్తేస్తుండడం ఆరోపణలకు తావిస్తోంది. ప్రభుత్వం గడువును చాలాసార్లు పెంచినా రైస్‌మిల్లర్లు మాత్రం సాంకేతిక, క్షేత్రస్థాయి పరిస్థితులను ఎత్తిచూపుతూ చేతులెత్తేస్తుండడం ఆరోపణలకు తావిస్తోంది. మొత్తానికి సీఎంఆర్‌పై అధికారుల తీరుపైనా, మిల్లర్ల ధోరణిపైనా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్‌లు ఉక్కుపాదం మోపుతుండడంతో.. ఇక అసలు కార్యాచరణ ముందు రోజుల్లో మొదలు కాబోతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.





సీజ్ చేసి నోటీసు అతికించిన అధికారులు (ఫైల్)



సీజ్ చేసిన చించోలి గ్రామంలోని శ్రీసాయి రైస్‌మిల్లు ఇదే..



సీఎంఆర్ బియ్యాన్ని మిల్లింగ్ చేసి ఉంచిన దృశ్యం (ఫైల్)

పట్టణాభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి

● కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 28 : నిర్మల్ పట్టణ అభివృద్ధికి మున్సిపల్ పాలకవర్గం, అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పిలుపునిచ్చారు. బుధవారం నిర్వహించిన బడ్జెట్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మున్సిపల్ సిబ్బంది వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని, దీనికి కౌన్సిలర్లు పూర్తిగా సహకరించాలని కోరారు. పనులపై కౌన్సిలర్లు, అధికారులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఖర్చు చేసిన ప్రతీ రూపాయి లెక్కలు పారదర్శకంగా ఉండాలన్నారు. అన్ని వార్డుల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంచిర్యాల్ చౌరస్తా వద్ద నిర్మించిన స్మశాన వాటిలో నీటి వసతి కల్పించాలని, ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. 2023-2024 బడ్జెట్ ఆమోదం కోసం సమావేశం నిర్వహించారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలు కౌన్సిలర్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, కమిషనర్ సీవీఆర్ రాజు, కౌన్సిలర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అసౌకర్యాల మధ్య.. ఇంటర్ పరీక్షలు ప్రారంభం

● జిల్లా వ్యాప్తంగా తొలిరోజు 534మంది విద్యార్థుల గైర్హాజరు



భైంసాలో బేంచీలపైనే పరీక్ష రాస్తున్న విద్యార్థులు

భైంసా, ఫిబ్రవరి 28: జిల్లాలో బుధవారం ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు అసౌకర్యాల మధ్య ప్రారంభమయ్యాయి. వసతుల లేమి, సౌకర్యాల కరవుతో విద్యార్థులు అవస్థలు పడుతూ పరీక్షలు రాశారు. భైంసా పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, రేయిన్ బో జూనియర్ కళాశాల, వశిష్ట జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో వసతులు, సౌకర్యాలు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. బేంచీలపై కూర్చొని పరీక్ష రాయడానికి తంటాలు పడ్డారు. కొన్ని గదుల్లో వెలుతురు సక్రమంగా లేక విద్యార్థులు పాట్లు పడ్డారు. పరీక్షల నిర్వహణ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నామన్న అధికారుల ప్రకటనలు ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు. మరోవైపు.. సెంటర్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

● 534 మంది విద్యార్థుల గైర్హాజరు

ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి అధికారులు జిల్లా వ్యాప్తంగా 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 15 ప్రభుత్వ, 8 ప్రైవేటు కళాశాలల్లో పరీక్ష కేంద్రాలున్నాయి. బుధవారం నిర్వహించి మొదటి సంవత్సరం పరీక్షకు జనరల్ కోర్సు విద్యార్థులు 5797 మంది హాజరు కావాల్సి ఉండగా.. 348 మంది గైర్హాజరయ్యారు. ఇక వొకేషనల్ కోర్సుకు సంబంధించి 1202మంది విద్యార్థులు హజరు కావాల్సి ఉండగా 186 మంది గైర్హాజరయ్యారు. 23 పరీక్ష కేంద్రాలకు గాను జనరల్ కోర్సు, వొకేషనల్ కోర్సులకు సంబంధించి 6999 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 6495 మంది హాజరవ్వగా 534 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

ముథోల్‌లో..

ముథోల్, ఫిబ్రవరి 28 : మండల కేంద్రమైన ముథోల్‌లో బుధవారం మొదటి రోజు ప్రారంభమైన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ముథోల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 258 విద్యార్థులకు గాను 242 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 16 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కైసర్ పాషా తెలిపారు. అలాగే ముథోల్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రంలో 377 మంది విద్యార్థులకు గాను 340 విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా.. 37మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ వేణుగోపాల్ తెలిపారు.

కుభీర్‌లో..

కుభీర్, ఫిబ్రవరి 28 : మండల కేంద్రం కుభీర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభం అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ పి. సునీల్ కుమార్ తెలిపారు. బుధవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు తెలుగు, హింది పరీక్షలు నిర్వహించగా 150 మంది విద్యార్థులు హాజరు కాగా, ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్సైలు, సిట్టింగ్‌స్క్వాడ్ అబ్దుల్ రెహమాన్‌లు పరిశీలించారు. పరీక్షలు జరుగుతున్న తీరుపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు.



హన్మంత్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐకే రెడ్డి, కుటుంబ సభ్యులు

హన్మంత్ రెడ్డి మృతి తీరని లోటు

● మాజీ మంత్రి ఐకే రెడ్డి ● ఎల్లపెల్లిలో ఘన నివాళులు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 28 : తన సోదరుడు అల్లోల హన్మంత్‌రెడ్డి మృతి కుటుంబానికి తీరని లోటని మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. బుధవారం స్వగ్రామమైన జిల్లాలోని ఎల్లపెల్లిలో దశ దినకర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకే రెడ్డి మాట్లాడుతూ.. తమ కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తాను రాజకీయాల్లోకి రాకముందు నుంచే హన్మంత్‌రెడ్డి వ్యాపార రంగంలో అపార అనుభవం గడించి అండగా నిలిచారన్నారు. గత కొంతకాలంగా అనారోగ్య కారణాలతో సమస్యలు ఎదుర్కొన్నారన్నారు. అన్న మృతి తీవ్రంగా కలిచి వేసిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు గొప్ప లక్ష్యం పెట్టుకుని చదవాలి

● కేజీబీవీ అదనపు గదుల నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే

దస్తూరాబాద్, ఫిబ్రవరి 28: విద్యార్థులు గొప్ప లక్ష్యాన్ని పెట్టుకొని ఉన్నత చదువులు చదువుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదవాలని పేర్కొన్నారు. అనుకున్న లక్ష్యాలను సాధించడానికి నిరంతరం చదవాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. అనంతరం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. త్వరలో లక్ష రూపాయలతో పాటు తులం బంగారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, మండల ఎంపీపీ సింగరి కిషన్, వైస్ ఎంపీపీ రాజు నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుర్గం మల్లేష్, నాయకులు రమేష్, గోపాల్, సతీష్, అధికారులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 28 : చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటా మని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి బుధవారం హెచ్చరించారు. మండలంలోని బోరిగాం గ్రామంలో సాయంత్రం ఆకస్మికంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 64 వెహికల్స్ పట్టుకుని పరిశీలించి తిరిగి అప్పజెప్పారు. బోరిగాం తండాలో అక్రమంగా నిల్వ ఉంచిన 300ల లీటర్ల బెల్లం పానకాన్ని, 11 లీటర్ల నాటు సారను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా స్థానికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐ నవీన్ కుమార్, ఎస్సైలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి28: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాశారు. మొత్తం 288మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా 281 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ సునీల్ తెలిపారు. మిగితా ఏడుగురు విద్యార్థులు వివిధ కారణాలతో హాజరుకాలేదన్నారు. పరీక్షా సమయంలో పరీక్షా కేంద్రమును అకస్మికంగా బోర్డ్ సీఐ రమేష్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంటరుకు దాదాపు 200ల మీటర్ల దూరంలో ఎవరు ఉండకుండా చూడాలని పోలీసులకు సూచించారు. పరీక్షా సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేసి ఉంచాలని లేకపోతే కేసులు నమోదు చేస్తామని నిర్వాహకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై నరేష్, పోలీసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు

ఖానాపూర్, ఫిబ్రవరి 28 : ఖానాపూర్ మున్సిపల్ రాజకీయం మరో రసవత్తరమైన మలుపు తిరిగింది. ఉదయం కౌన్సిలర్ల శిబిరం నుంచి బీఆర్ఎస్ పార్టీకి వైస్ చైర్మన్ పదవి కేటాయించాలంటూ అలకబూని బయటకు వెళ్లిపోయిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు పదవిని దక్కించుకున్న తర్వాత తిరిగి కాంగ్రెస్ గూటికే చేరడం హాట్ టాఫిక్‌గా నిలిచింది. కాంగ్రెస్ చైర్మన్ అభ్యర్థికి మద్దతు ప్రకటించిన తమ ముగ్గురు కౌన్సిలర్లలో ఒకరికి వైస్ చైర్మన్ పదవి కావాలని బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు సంతోష్, జన్నారపు విజయలక్ష్మి, పరిమిలతలు బుధవారం ఉదయం పట్టుబట్టారు. కాగా ఎన్నిక సజావుగా ముగిసిన అనంతరం మధ్యాహ్నం ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సమక్షంలో వైస్ చైర్మన్ కావాలి సంతోష్ మరో ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు జన్నారపువిజయలక్ష్మి,పరిమిలత, ఇండిపెండెంట్ కౌన్సిలర్ కురుమ శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పరిమి సురేష్, జిల్లా నాయకులు జన్నారపు శంకర్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగా విప్‌ను దక్కిరించారంటూ బీఆర్ ఎస్ పార్టీ కౌన్సిలర్లపై ఆ పార్టీ నాయకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు టీఎల్ఎం కిట్ల పంపిణీ

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 28: జిల్లాలోని మానసిక వికలాంగ విద్యార్థులకు బుధవారం టీఎల్ఎం కిట్లను డీఈవో రవీందర్‌రెడ్డి భవిత కేంద్రంలో పంపిణీ చేశారు. ఎస్ఐఈపీఐడీ సభ్యుడు శ్యామ్ పాల్గొన్నారు. డీఈవో మాట్లాడుతూ... జిల్లాలో గుర్తించబడిన 15 మంది మానసిక వైకల్యం గల విద్యార్థులకు ఈ కిట్లు అందజేసినట్లు చెప్పారు. అభ్యాసన సామగ్రి ఈ కిట్లలో ఉంటుందన్నారు. ఈ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విలీన సమన్వయ కర్త ప్రవీణ్ కుమార్, ఎంఈవో శంకర్, హెచ్ఎం సుచిత్ర, తదితరులు పాల్గొన్నారు.

ధూపదీప నైవేద్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా విజయ్‌కుమార్ నియామకం

నిర్మల్‌కల్చరల్, ఫిబ్రవరి 28 : తెలంగాణ రాష్ట్ర ధూపదీప నైవేద్య అర్చక సంఘ ఉపాధ్యక్షుడిగా నిర్మల్‌కు చెందిన చిలుకముక్కు విజయ్ కుమార్ నియమితులయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్రకమిటీ ఏర్పాటైంది. రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా తుపాకుల రమణాచారి,సమచారప్రతినిధిగా వెంకట్రావు నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు యోగేష్ కుమార్ వారిని అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● స్వగ్రామంలో నెలకొన్న విషాదఛాయలు

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి28: హైదరాబాద్‌లోని రింగ్‌రోడ్డు పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలకేంద్రానికి చెందిన కొత్త శ్వేసిక్ (20) అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబీకులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం కొత్త లక్ష్మణ్, మమతల పెద్ద కుమారుడు కొత్త శ్వేసిక్ ఉన్నత చదువుల కోసం హైదరాబాదులో ఉంటూ చదు వుకుంటున్నాడని, బుధవారం స్నేహితులతో కలిసి కారులో రింగ్ రోడ్డుపై ప్రయాణిస్తున్న సమయంలో కారు అదుపుతప్పి బోర్ల పడడంతో క్రింద పడిన శ్వేసిక్ తలకు తీవ్రగాయాలవడంతో తీవ్ర రక్తంస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడని అన్నారు. అందరితో కలివిడిగా ఉండే యువకుడు అకస్మికంగా మృతి చెందడంతో స్వగ్రామంలో విశాదచాయలు నెలకున్నాయి.


























ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

● ఆకట్టుకున్న విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శనలు

ఉట్నూర్, ఫిబ్రవరి 28: ఉట్నూర్ మండలంలోని షాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శన ఆకట్టుకుంది. జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా సైన్స్ టీచర్లు చంద్రశేఖర్‌గౌడ్, రవీందర్ ఆధ్వర్యంలో విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. 9వ తరగతికి చెందిన విద్యార్థులు అభిరామ్, సాయిప్రసాద్‌లు రైతులు తమ పంటలను వన్యప్రాణుల నుంచి కాపాడుకోవడానికి సోలార్ పెన్సింగ్ ఏర్పాటు చేసుకుంటే వన్యప్రాణులతో పాటు జంతువుల బారీ నుంచి తమ పంటలు కాపాడుకోవచ్చని ప్రదర్శించారు. ఏడవ తరగతికి చెందిన పల్లవి నీటి కొరత, సమన్వయం, నిలువ పద్ధతులను వివరించే లార వాటర్ సైకిల్ ప్రదర్శన దర్శించారు. ఏడవ తరగతి విద్యార్థిని వేదిక మూత్రపిండాలో పాడైపోయిన వారికి కృత్రిమంగా రక్తాన్ని ఫిల్టర్ చేసే విధానం ప్రదర్శించారు. ఆరవ తరగతి విద్యార్థులు చైతన్య, అనన్య కార్బన్ డాయాక్సైడ్ వాతావరణంలో పెరగడం, ఆక్సిజన్ విలువలు కొవ్వొత్తులతో గురించి ప్రదర్శించారు. ఏడవ తరగతి విద్యార్థి మౌనిక విద్యార్థులకు ప్రత్యక్ష బోధన ద్వారా అవయవాల అవగాహన ప్రదర్శించారు. మాదిరిగ ఏడవ తరగతి విద్యార్థిని శ్రద్ధ అయస్కాంతాల ద్వారా ఉచితంగా విద్యుత్ తయారు చేసే ప్రదర్శన ప్రదర్శించారు. ఇండ్ల పైన ఏర్పాటు చేసుకున్న ట్యాంకులో నీరు నిండిన తర్వాత నీటి వృదా కాకుండా నివారించడానికి వాటర్ అలారంను ప్రదర్శించారు. వర్షపు నీరు నిలువ చేసే విధానంను ఏడవ తరగతి విద్యార్థిని పల్లవి నేను వృదా నిలువ చేసే భూగర్భ జలాలు పెంచు కోవడానికి కావాల్సిన ప్రదర్శన ప్రదర్శించారు. భూకంపం భారీన ముందు జాగ్రత్తల కోసం అలారం ఇవ్వడాన్ని విద్యార్థిని శ్రావణి ఎర్త్‌క్లాక్ అలారంను ప్రదర్శించారు. 8వ తరగతి విద్యార్థిని శరణ్య విద్యార్థులకు నాలను బోధిస్తున్నప్పుడు అర్థవంతంగా కోసం కరస్పాండెంట్ ఏంజెల్స్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విజ్ఞాన ప్రదర్శన ద్వారా విద్యార్థులకు మరిన్ని మెలుకువలు నేర్పించడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాతరి రమేష్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలో జాతీయసైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు వడూర్, బుగ్గారాం, కుంటాల, వాంకిడి, కుమారి, తేజాపూర్ తదితర గ్రామాలలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించగా వడూర్ గ్రామంలో ఎంఈవో భూమారెడ్డి, సైన్స్ ప్రదర్శనను తిలకించారు. అంతకు ముందు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక విద్య వైద్య వాణిజ్య రంగాలకు సైన్స్ మూలమన్నారు. సైన్స్ కార్యక్రమాల నిర్వహణలో మండలాన్ని ముందు వరుసలో ఉంచాలన్నారు. ఇందులో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: యువత సీవీ రామన్ సేవలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంమోహన్ రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సీవీ రామన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల విద్యార్థులు సైన్స్ డేలో అన్ని సబ్జెక్టుల నుంచి వివిధ నమూనాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి అభివృద్ధికి సైన్స్ ఎంతో దోహదపడిందన్నారు. వివిధ అంశాలను వెలుగులోకి తీసుకువచ్చిన శాస్త్రవేత్తల సేవలను ఆయన వివరించారు. ఇందులో హెచ్ఎం రాథోడ్ రోహిదాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



తలమడుగులో జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



షాంపూర్‌లో ఆక్సిజన్, కార్బన్ డయాక్సైడ్ ప్రయోగం గురించి వివరిస్తున్న బాలికలు

భీంపూర్: మండలంలోని పిప్పల్‌కోటిలో ప్రభుత్వ పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్నీ ఘనంగా నిర్వహించారు. బౌతిక పిత మహుడు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మహేష్ మాట్లాడుతూ సి.వి. రామన్ చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, వీర కుమార్, రమేష్, రోజా రాణిలు పాల్గొన్నారు.

తలమడుగు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులచే గుండె పని తీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కాకుండా డెమో చేయించారు. అంతేకాకుండా పాటలు, ఉపన్యాసాలు, స్కిట్, డ్రామా, సెల్‌ఫోన్ అతిగా వాడటం వల్ల అనర్థాలు తదితర పోటీలు నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు చాలా ఉత్సాహంగా సైన్స్ ఉపయగాలు తెలుసుకున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ హెచ్ఎంలు లలిత, వెంకటేశ్వర్, సుమలత, మురళీధర్, రాకేష్, రవీంద్ర కుమార్, స్వప్న, రాధిక పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని కౌటా(బి) ఉన్నత పాఠశాలతో పాటు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నాగభూషణం పాఠశాలలో బుధవారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులు తయారు చేసిన వివిధరకాల ప్రయోగ ఉపకరణాలను పరిశీలించడం జరిగింది. కౌటా(బి) ప్రాథమిక ఉన్నత పాఠశాలలో వీడీసీ అధ్యక్షుడు గాజుల సురేందర్, మాజీ వీడీసీ అధ్యక్షులు మల్లెపూల గంగయ్యతో పాటు ఇట్టెడి సాగర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శైలేందర్‌రెడ్డి, పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు తయారు చేసిన ఉపకరణాలు పరిశీలించారు. బోథ్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, నాగభూషణం పాఠశాలలో ప్రిన్సిపాల్ కిషోర్‌కుమార్‌లు విద్యార్థులు తయారు చేసిన ఉపకరణాలను పరిశీలించి అభినందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కౌటా(బి) పాఠశాల విద్యార్థులకు వివేకానంద యూత్ సభ్యులు విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

జైనథ్: సమాజంలో ఉన్న ప్రతీఒక్కరు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకో వాలని జైనథ్ మండల తహసీల్దార్ శ్యాంసుందర్ అన్నారు. బుధవారం మండలకేంద్రమైన జైనథ్‌లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జైనథ్ మాజీ సర్పంచ్ డి.దేవన్న, ఎంపీటీసీ కె.సుదర్శన్, జైనథ్ మండల ఉప తహసీల్దార్ రాథోడ్‌రాజేశ్వరి, ఇన్‌చార్జీ హెచ్ఎం సంతోష్,డీడీ ఎ.దయానంద్‌రెడ్డిలతో పాటు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిర్మల్ కల్చరల్: నిర్మల్‌లోని డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. నోబెల్ గ్రహీత సర్ సీవీ రామన్ జయంతి సందర్భంగా సైన్స్ దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. సీవీ రామన్ నూతన ఆవిష్కరణలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. శాస్త్రీయ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

అలాగే, జాఫ్రాపూర్ హైస్కూల్‌లో బుధవారం సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్ మాట్లాడుతూ... శాస్త్ర సాంకేతిక రంగాల్లో చోటుచేసుకుంటున్న విప్లవాత్మక మార్పులను జీవితంలో భాగం చేసుకొని ఎదగాలన్నారు. వైజ్ఞానిక సౌరభాలు పుస్తకంలోని పలు అంశాలు విద్యార్థులకు వివరించారు. సైన్స్ క్విజ్ విజేతలకు బహుమతులు అందజేశారు.

భైంసా: పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం సైన్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆయా పాఠశాలల్లో విద్యార్థులు సైన్స్ ఫేర్ కార్యక్రమాలను చేపట్టి పలు ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థుల తల్లితండ్రులు పాఠశాలలకు అధికంగా తరలివచ్చి ప్రదర్శనలు తిలకించారు. ఆల్ఫోర్స్ హైస్కూల్, శ్రీ గౌతమి హైస్కూల్, చైతన్య హైస్కూల్, వేదం హైస్కూల్‌లో జరిగిన సైన్స్ ఫేర్ కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఆయా పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ముథోల్: ముథోల్ మండల కేంద్రంలోని రబింద్ర ఉన్నత పాఠశాల, అక్షర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల, శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అక్షర, శిశు మందిర్, గురుకుల పాఠశాలలో విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలు నిర్వహించారు. సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతిని వెలిగించారు. జాతీయ విజ్ఞాన దినోత్సవం గురించి వివరించారు. విద్యార్థులు తయారు చేసుకొని వచ్చిన పరికరాల గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అనేక విజ్ఞాన ప్రయోగాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్, సుభాష్, సారథి రాజు, కరస్పాండెంట్ రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



భైంసాలోని ప్రయోగాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



ముథోల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఖానాపూర్‌లో ముగిసిన..

మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక

● చైర్మన్ పీఠం దక్కించుకున్న కాంగ్రెస్ ● చైర్మన్‌గా రాజుర సత్యం.. వైస్ చైర్మన్‌గా బీఆర్ఎస్ కౌన్సిలర్ కావలి సంతోష్ ఎన్నిక

ఖానాపూర్, ఫిబ్రవరి 28: ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ముగిసింది. చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ దక్కించుకోగా.. వైస్ చైర్మన్ పదవి బీఆర్ఎస్ కౌన్సిలర్‌కు దక్కింది. చైర్మన్‌గా ఇన్నాళ్లు కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న రాజుర సత్యం అలియాస్ చిన్నం సత్యనారాయణ ఎన్నిక కాగా, వైస్ చైర్మన్‌గా బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ కావలి సంతోష్ ఎన్నికయ్యారు. ఉదయం ఖానాపూర్‌లో జరిగిన నాటకీయ పరిణామాల నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక ఒక దశలో వాయిదా పడుతుందని అంతా భావించారు. ముందు నుంచి గత చైర్మన్, వైస్ చైర్మన్‌లను గద్దెదించేందుకు పార్టీలకు అతీతంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఇండిపెండెంట్ కౌన్సిలర్లు అంతా ఏకమై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సమయంలోనే కాంగ్రెస్ పార్టీకి చెందిన మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజుర సత్యంను చైర్మన్ చేసేందుకు కౌన్సిలర్లంతా నిర్ణయానికి వచ్చారు. కాగా వైస్ చైర్మన్ విషయంలో బీఆర్ఎస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని చైర్మన్, వైస్ చైర్మన్‌లపై తిరుగుబావుటా ఎగురవేసిన కౌన్సిలర్లు అంతా ఏకాభిప్రాయానికి వచ్చినట్లు ప్రచారం జరిగింది. అనంతరం పలుమార్లు వాయిదా పడుతూ వచ్చిన అవిశ్వాస తీర్మానం.. ఎట్టకేలకు నెగ్గడంతో అధికారులు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం తేదీని ఖరారు చేశారు. దీంతో బుధవారం నిర్మల్ జడ్పీ సీఈవో గోవింద్ ఎన్నికల అధికారిగా ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించారు. కానీ ఉదయం మున్సిపల్ కార్యాలయానికి హాజరయ్యే ముందు కౌన్సిలర్లంతా ఒక దగ్గర సమావేశమై వైస్ చైర్మన్ ఎన్నిక కోసం చర్చ చేసినట్లు తెలిసింది. ఈ చర్చలో మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు మైనారిటీ కౌన్సిలర్లు ఒకరికి ఇవ్వాలని అధికార పార్టీ వర్గాలు పట్టుబట్టడంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు అసంతృప్తితో శిబిరం నుంచి బయటకు వెళ్లిపోయారు. కౌన్సిలర్లు బయటకు వెళ్లిపోవడమే కాకుండా సోషల్ మీడియాలో జరిగిన వివాదంపై పోస్టులు పెట్టడంతో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడుతుందని అంతా భావించారు. కానీ చైర్మన్ అభ్యర్థి రాజుర సత్యం ఇటు స్వపక్షంలోని కౌన్సిలర్లతో పాటు అటు విపక్షంలోని బీఆర్ఎస్ కౌన్సిలర్లను సముదాయించారు. దీంతో ఇరువర్గాలు ఏకాభిప్రాయానికి వచ్చి బీఆర్ఎస్ కౌన్సిలర్ కావలి సంతోష్‌కు వైస్ చైర్మన్ పదవిని అప్పగించేందుకు ఒప్పుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఉదయం నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నప్పటికీ తీరా ఎన్నిక సమయానికి కౌన్సిలర్లు అంతా కలిసికట్టుగా మున్సిపల్ కార్యాలయానికి హాజరయ్యారు. కాగా గత చైర్మన్, గత వైస్ చైర్మన్ సహా మరో కౌన్సిలర్ ఈ ఎన్నిక ప్రక్రియకు గైర్హాజరయ్యారు. మున్సిపల్‌లో ఓటు హక్కు కలిగి ఉన్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సైతం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియకు హాజరయ్యారు. చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల కోసం ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో రెండు పదవులు ఏకగ్రీవమయ్యాయి. కౌన్సిలర్లంతా ఏకాభిప్రాయంతో ఉండడంతో చైర్మన్‌గా కాంగ్రెస్ అభ్యర్థి రాజుర సత్యం, వైస్ చైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి కావలి సంతోష్‌లు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి గోవింద్ తెలిపారు. ఈ ఎన్నిక ప్రక్రియకు కౌన్సిలర్లు రాజుర సత్యం, కావలి సంతోష్, జన్నారపు విజయలక్ష్మి, నాయిని స్రవంతి, పరిమి లత, ఆఫ్రిన్ బేగం, గుగ్లావత్ కిషోర్ నాయక్, కుర్మ శ్రీనివాస్, ఫౌజియా బేగంలు హాజరయ్యారు. ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ఖానాపూర్ సీఐ మోహన్, ఎస్సై లింబాద్రి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద పకడ్బందీ భద్రత ఏర్పాట్లు చేశారు.



● చైర్మన్, వైస్ చైర్మన్‌లను అభినందిస్తున్న ఎమ్మెల్యే





వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న ప్రీసైడింగ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, హాజరైన ఎంపీటీసీలు

గుడిహత్నూర్ ఎంపీపీ ఎన్నిక వాయిదా

గుడిహత్నూర్, ఫిబ్రవరి 28: రెండేళ్ల నుంచి ఖాళీగా ఉన్న ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీకి చెందిన ఎంపీటీసీలు హాజరయ్యారు. మన్నూర్‌కు చెందిన బీఆర్ఎస్ ఎంపీటీసీ కేంద్రే జ్ఞానోబా ఎంపీపీకి పోటీలో నిలబడగా తోషం ఎంపీటీసీ సాగిర్‌ఖాన్ ప్రతిపాదించగా మచ్చాపూర్ ఎంపీటీసీ జాదవ్ బలపర్చారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గురుజ, ఎంపీటీసీ పెందూర్ లలిత ఎంపీపికి పోటీలో నిలబడగా గుడిహత్నూర్ ఎంపీటీసీ అంకతి సవిత ప్రతిపాదించగా సీతాగొంది ఎంపీటీసీ చిట్యాల కృష్ణవేణి బలపర్చారు. బీజేపీకి చెందిన శాంతాపూర్ ఎంపీటీసీ భారత్, గుడిహత్నూర్ రెండు ఎంపీటీసీ, కోవ తులసి తటస్థంగా ఉండగా.. ఎవరికి సరైన మెజారిటీ రాకపోవడంతో ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు ప్రీసైడింగ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మళ్లీ గురువారం ఎన్నిక నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఎంపీడీవో మహ్మద్ అబ్దుల్‌హై, జడ్పీ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

'అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థిని మృతి'

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 28: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మామిడిగూడ ఆశ్రమ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న తొడసం మహే శ్వరి అనే విద్యార్థిని రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. విద్యార్థి మృతికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఏటీడబ్ల్యూఓలే కారణమంటూ ఆదివాసీ సంఘాల నాయకులు కుటుంబ సభ్యు లతో కలిసి ఆందోళన చేపట్టారు. రిమ్స్ ఎదుట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు, ఏటీడబ్ల్యూవోలను సస్పెండ్ చేయడంతో పాటు బాధిత కుటుంబానికి రూ.50లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడేందుకు యత్నించిన ఫలితం లేకుండా పోయింది. అనంతరం ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్ వచ్చి నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలతో పాటు ఘటనపై పూర్తి విచారణ చేయిస్తానని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ గత ఐదు రోజులుగా తనకు జ్వరం ఉందని విద్యార్థి ప్రధానోపాధ్యాయుడికి చెప్పిన పట్టించుకోలేదన్నారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి రిమ్స్‌కు తరలించారన్నారు. చికిత్స పొందుతు బుధవారం మృతి చెందిందన్నారు. ప్రధానోపాధ్యాయుడు, ఏటీడబ్ల్యూవో నిర్లక్ష్యం కారణంగా ఆదివాసీ విద్యార్థి మరణించిందని ఆరోపించారు. బాధిత కుటుంబానికి నష్ట పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఐటీడీఏ ద్వారా ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా జిల్లా కేంద్రంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రాస్తారోకో ఉద్రిక్తంగా కొనసాగింది. నాలుగు గంటలు గడుస్తున్నా ఆందోళనను వారు విరమించలేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.




ఇచ్చోడ వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

'వాహన నిబంధనలు పాటించాలి'


ఇచ్చోడ, ఫిబ్రవరి 28: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని ఏఎస్సై లింబాజి అన్నారు. బుధవారం ఇచ్చోడ మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి కూడలి వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం వల్ల వాహనం నడిపేవారి ప్రణాలకు రక్షణ ఉంటుదని అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రతీఏటా ఎందోమంది ప్రాణాలు విడుస్తున్నారన్నారు. ప్రతీ వాహనదారుడు తప్పకుండా వాహనపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులకు కూచోబెట్టుకోవద్దని వాహనదారులు అప్రమత్తంగా వాహనాలను జాగ్రత్తగా నడుపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహనదారులు, తదితరులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి ఇద్దరు గల్లంతు

● మిస్సింగ్ కేసుగా నమోదు.. ఒకరి మృతదేహం లభ్యం



మృతి చెందిన శ్రీహరి(ఫైల్)



దారుట్ల సాయి (ఫైల్)

తలమడుగు, ఫిబ్రవరి 28: మండలంలోని కుచ్లాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు వ్యవసాయ బావిలో మధ్యాహ్నం పూట ఈతకు వెళ్లి మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. కుచ్లాపూర్‌కు చెందిన సోయం శ్రీహరి (16), దారుట్ల సాయి(18)అనే యువకులు గ్రామంలో గల తమ వ్యవసాయ పొలాల్లో పనికి వెళ్లి మధ్యాహ్నం సమయంలో వ్యవసాయ పొలంలో గల బావిలో స్నానం చేసేందుకు తాడుతో దిగి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. బావిలో నుంచి శబ్దం రావడంతో చుట్టుపక్కల వారు గమనించి బావి వద్దకు రాగా బావివద్ద యువకుల దుస్తులు, చెప్పులు, సెల్‌ఫోన్ కనబడడంతో వెంటనే గ్రామస్థులకు సమాచారం అందించగా.. గ్రామస్థులు, కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి తలమడుగు పోలీసులు చేరుకుని బావిలో వెతికించగా దారుట్ల సాయి మృతదేహం లభ్యమైందని, సోయం శ్రీహరి కోసం వెతుకుతున్నామన్నారు. ఈ మేరకు తలమడుగు ఎస్సై మాట్లాడుతూ కుటుంబీకులు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్మీడియట్ విద్యార్థికి గాయాలు

ఇచ్చోడ, ఫిబ్రవరి 28: పరీక్షకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై వెళుతూ.. రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలైన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. నేరడిగొండ మండలానికి చెందిన విష్ణువర్ధన్ (17) ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష రాసేందుకు ఉదయం స్కూటిపై ఇంటి నుంచి బయలుదేరిన విద్యార్థి మండలంలోని సాత్ నెంబర్ గ్రామం వద్ద ఆగి ఉన్న బస్సును స్కూటీ ఢీకొట్టడంతో గాయాలై అక్కడే పడిపోయాడు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది ఇచ్చోడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులకు ఎలాంటి సమాచారం అందకపోవడం గమనార్హం.



జిల్లాకు.. మోదీ రాక

- మార్చి 4న జిల్లాలో పర్యటించనున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన.. అనంతరం భారీ బహిరంగ సభ
- ఆదిలాబాద్ నుంచే పార్లమెంట్ ఎన్నికల శంఖారావం
- నేడు జిల్లా పార్టీ నేతల సన్నాహక సమావేశం
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం

ఆదిలాబాద్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యం లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ జిల్లా పర్యటన ఖరారైనట్లు తెలుస్తుంది. పదేళ్ల తర్వాత తొలిసారి మోదీ జిల్లాకు రానున్నారు. ఈ మేరకు జిల్లా నేతలకు పార్టీ అధిష్ఠానం ఆదేశాలు జారీ చేసింది. ప్రధానమంత్రి మార్చి 4న జిల్లాలో పర్యటించనున్నారు. పర్యటనకు సంబంధించిన అధికారిక షెడ్యూల్ గురువారం విడుదలయ్యే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. మార్చి 12 లేదా 13న పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని అధికార వర్గాల ద్వారా తెలుస్తుంది. దీంతో సిట్టింగ్ స్థానాన్ని మళ్లీ తన ఖాతాలో వేసుకునేందుకు బీజేపీ ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇప్పటికే ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో విజయ సంకల్ప యాత్రను చేపట్టిన బీజేపీ విజయవంతంగా పూర్తి చేసింది. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి ఎన్నికలకు వెళ్లేందుకు బీజేపీ ముమ్మర ప్రయత్నాలు చేస్తుంది. అయితే ప్రధాని జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే జిల్లా పోలీసులకు ప్రధాని పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ వివరాలు అందినట్లు తెలుస్తుంది.

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని సారించినట్లు తెలుస్తుంది. ఇప్పటికే మంజూరైన ఆదిలాబాద్-ఆర్మూర్ వయా పటాన్‌చెరువు రైల్వేలైన్ పనులకు సంబంధించిన సర్వే పనులు తుదిదశకు చేరుకున్నాయి. దీంతో ప్రధాని పర్యటన సందర్భంగా రైల్వేలైన్ నిర్మాణ పనులను ప్రారంభించే అవకాశం ఉంది. అలాగే ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని కాగజ్‌నగర్, ఇంద్రవెల్లి మండలం పిట్టబొంగారం, నార్నూర్ మండలాలకు మంజూరైన ఏకలవ్య మోడల్ స్కూల్స్ భవనాల నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు. వీటితో పాటు జైనథ్ మండలం బోరజ్ నుంచి బేల మండలం మహారాష్ట్ర సరిహద్దు వరకు 32.97 కి.మీ.ల మేర 353(బి) జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం ప్రభుత్వం రూ.490 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే ఈ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను కూడా అధికారులు పూర్తి చేశారు. అలాగే జిల్లా కేంద్రంలో ఎరోడ్రమ్ నిర్మాణానికి ఎన్నో ఏళ్లుగా డిమాండ్ ఉంది.

ప్రధాని మోదీ పర్యటన వివరాలిలా..

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మార్చి 4న ప్రధాని మోదీ జిల్లా పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం 9.20గంటలకు మహారాష్ట్రలోని నాగపూర్ ఎయిర్‌పోర్టుకు మోదీ చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా 10.20కి ప్రత్యేక హెలిప్యాడ్ ద్వారా ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంటారు. 10.30 నుంచి 11గంటల వరకు వివిధ అభివృద్ధి పనులకు శంఖు స్థాపన చేస్తారు. 11.10 నిమిషాలకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసే పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొంటారు. 12.15 నిమిషాలకు తిరిగి హెలిప్యాడ్ ద్వారా నాందెడ్ వెళ్లనున్నారు. 1.10 నిమిషాలకు మహారాష్ట్రలోని నాందెడ్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అయితే ప్రధాని పర్యటన షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేర్పులు కూడా చోటు చేసుకునే అవకాశం ఉన్నాయని తెలుస్తుంది.

దీనికి ప్రధాని భూమిపూజ చేసే అవకాశం ఉందని అధికార వర్గాల ద్వారా తెలుస్తుంది. వీటితో పాటు మరిన్ని అభివృద్ధి పథకాలకు శంఖు స్థాపన చేసే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

ఆదిలాబాద్ నుంచే శ్రీకారం

పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని ప్రధాని మోదీ ఆదిలాబాద్ జిల్లా నుంచే శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటికే కొమురంభీం క్లస్టర్ పరిధిలోని విజయ సంకల్పయాత్రను నిర్మల్ జిల్లా బాసర నుంచి ప్రారంభించి పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా బస్సుయాత్రను విజయవంతంగా చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా లేని విధంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోనే ముథోల్, నిర్మల్, ఆదిలాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్ నాలుగు నియోజక వర్గాలను బీజేపీ దక్కించుకుంది. దీంతో మంచి ఊపుతో కనిపిస్తున్న కమలం పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో విజయ ఢంకాను మోగించేందుకు ఆదివాసీల అడ్డా ఆదిలాబాద్ గడ్డ పై నుంచే ఎన్నికల శంఖారావాన్ని పూరించేందుకు సిద్ధమైంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి సుమారుగా లక్ష మంది జనాలను తరలించేందుకు ఆ పార్టీ నేతలు సన్నాహాలు చేస్తున్నారు.

ముఖ్య నేతల సమావేశం

ప్రధాని మోదీ జిల్లా పర్యటన సందర్భంగా ఆ పార్టీ ముఖ్య నేతలు గురువారం సన్నాహక సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి ఎంపీ సోయంబాపురావుతో పాటు ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని నలుగురు ఎమ్మెల్యేలు, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జీ, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఇతర ముఖ్య నేతలు హాజరయ్యే అవకాశం ఉందని తెలిసింది. మోదీ జిల్లా పర్యటనపై సమావేశంలో చర్చించనున్నారు. ముఖ్యంగా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా సమస్యలే ప్రధాన ఏజెండాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగం ఉండేలా జాగ్రత్త పడుతున్నారు.




బదిలీ అయిన కలెక్టర్ రాహుల్‌రాజ్


జిల్లా నూతన కలెక్టర్ రాజార్షిషా

జిల్లా నూతన కలెక్టర్‌గా రాజార్షి షా

- మెదక్ జిల్లాకు బదిలీ అయిన రాహుల్‌రాజ్

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 28: పార్లమెంట్ ఎన్నికల బదిలీల్లో భాగంగా కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను బుధవారం బదిలీ చేస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మెదక్ జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్న రాజార్షిషా జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. రాహుల్‌రాజ్ మెదక్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. అలాగే ఆదిలాబాద్ ఆర్డీవోగా పని చేస్తున్న స్రవంతి బదిలీపై వరంగల్‌కు వెళ్లారు. వరంగల్ జిల్లా ఆర్డీవోగా పనిచేస్తున్న అంబదాస్‌రాజేశ్వర్ ఆదిలాబాద్ ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టనున్నారు.


బుడుందేవుడికి పూజలు చేస్తున్న భక్తులు

కోలాహలంగా సాగుతున్న బుడుం జాతర

ఉట్నూర్, ఫిబ్రవరి 28: మండలంలోని షాంపూర్‌లో వెలిసిన మెస్రం గిరిజనుల దైవం బుడుందేవ్ జాతర కోలాహలంగా కొనసాగుతోంది. ఈ నెల 15న మెస్రం గిరిజనుల సంప్రదాయ పూజలతో ప్రారంభమైన జాతర గత మూడు రోజుల నుంచి పుంజుకుంది. కేస్లాపూర్ నాగోబా జాతర నుంచి షాంపూర్ బుడుందేవ్ జాతరకు తరలివచ్చిన వ్యాపారులు తమ దుకాణాలను ఏర్పాటు చేసుకుని ప్రజల కోసం వేచి చూస్తున్నారు. గత ఆదివారం సెలవుదినం రావడంతో గిరిజనులు సైతం బుడుందేవ్ దర్శనానికి చేరుకుంటున్నారు. గిరిజనులతో పాటు గిరిజనేతరులు సైతం శివుడి వాహనమైన నందీశ్వరుడునిగా భావిస్తు గిరిజనులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. కాగా వ్యాపార దుకాణాలలో కూడా విక్రయాలు పెరగడంతో వ్యాపారులు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జాతరకు చేరుకుంటున్న ప్రజలు ముందుగా బుడుందేవ్‌కు పూజలు చేసి రంగుల రట్నాల వద్ద తమ పిల్లలతో కాలక్షేపం చేస్తున్నారు. అనంతరం స్త్రీల అలంకరణ వస్తువులు, పిల్లలకు బొమ్మలు, ఆటవస్తువులు కొనుగోలు చేసి ఇళ్లకు తరలి వెళ్తున్నారు.


జనంతో కిటకిటలాడుతున్న జాతర


ఆదిలాబాద్‌లో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల కోలాహలం




.. పరీక్షా క్రేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- జిల్లాలో మొత్తం 10,424 మంది విద్యార్థులకు గాను హాజరైంది 9690 మంది
- తొలిరోజు 734 మంది విద్యార్థుల గైర్హాజరు
- పరీక్షా కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 28: జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నిమిషం నిబంధన అమలులో ఉండడంతో పరీక్ష రాసే విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. అంతేకాకుండా సిబ్బంది విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలించి కేంద్రాల్లోకి అనుమతించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కేంద్రాల వద్ద సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేసినట్లు డీఐఈవో రవీందర్‌కుమార్ తెలిపారు. జిల్లాలో మొత్తం 10,424 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 9,690 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. జిల్లావ్యాప్తంగా 30 సెంటర్లలో ఈ పరీక్షలను నిర్వహించారు. అయితే మొదటి రోజు 734 విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్షలను అధికారులు పకడ్బందీగా నిర్వహించేందుకు ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 30 సెంటర్లకు గాను పలు సెంటర్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కాగా స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (బాలురు) పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పీఎస్ ఆకస్మీకంగా తనిఖీ చేశారు. అంతేకాకుండా ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాలను పరిశీలించి విద్యార్థుల హాజరు, సీసీ కెమెరా, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. నిరంతరం విద్యుత్ అంతరాయం లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఇచ్చోడ: ఇచ్చోడ మండలకేంద్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఐదు ప్రభుత్వ కళాశాలలు, నాలుగు ప్రైవేట్ కళాశాలలకు చెందిన విద్యార్థులు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, గిరిజన గురుకుల బాలుర, బాలికల పాఠశాలల్లో నిర్వహించిన ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో మొదటి ఏడాది విద్యార్థులు మొదటిరోజు పరీక్షను ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అయితే, పరీక్ష సమయంలో నిబంధనలు ఉల్లంఘించి జిరాక్స్ కేంద్రాలు తెరిచి ఉన్న దుకాణాలను పోలీసులు మూసి వేయించారు.

ఇంద్రవెల్లి: ఇంటర్మీడియట్ పరీక్షలు భాగంగా బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నిమిషం నిబంధనల అమల్లో ఉండటంతో విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. దీనిలో భాగంగా మండల కేంద్రంలో రెండు పరీక్ష కేంద్రాలకు గాను 490 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 423 మంది హాజరు కాగా 67 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అయితే అంతకు ముందు పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అధికారులు ఏర్పాట్లు కల్పించారు. అంతేకాకుండా 8.30 గంటల నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ద్విచక్ర వాహనాలపై కేంద్రాలకు తీసుకొచ్చారు.


- పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్


- సెంటర్ వద్ద సిబ్బందితో మాట్లాడుతూ..


ఇచ్చోడలో హాల్‌టికెట్ నెంబర్లు సరిచూసుకుంటున్న విద్యార్థులు


పరీక్షా కేంద్రానికి తరలి వస్తున్న విద్యార్థినులు

జిల్లా డీఆర్డీఏ అడిషనల్ పీడీ కె.రవీందర్ బదిలీ



ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 28: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జిల్లా డీఆర్డీఏ అడిషనల్ పీడీగా విధులు నిర్వహించిన కె.రవీందర్‌ను ప్రభుత్వం బుధవారం పెద్దపల్లి డీఆర్డీఏ పీడీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో ఆయన అక్కడ బాధ్యతలను స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు.

'డిజిటల్ లావాదేవీలపై అవగాహన ఎంతో అవసరం'

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 28: విద్యార్థి దశ నుంచే ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఎంతో అవసరమని జిల్లా పరిశ్రమ శాఖ మేనేజర్ పద్మభూషణ్‌రాజు అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహనకల్పించారు. ఆర్థిక భద్రత, ఆర్థిక పురోగతికి డిజిటల్ లావాదేవిలు దోహద పడుతాయని పరిశ్రమల శాఖ మేనేజర్ పద్మభూషణ్ రాజు ఈ సందర్భంగా అన్నారు. అంతేకాకుండా డిజిటల్ లావాదేవీలపై ప్రతీ ఒక్కరిలో అవగాహన ఎంతో అవసరమన్నారు. బ్యాంకు సేవల గురించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం భాస్కరప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ జలగం అనిత, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

ఉట్నూర్, ఫిబ్రవరి 28: ఉట్నూర్‌లోని జిల్లా కేంద్ర ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పేర్కొన్నారు. మంగళవారం ఉట్నూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిని అకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుప త్రిలోని పలువురు రోగులను పరామర్శించారు. వైద్యం అందుతున్నతీరును తెలుసుకున్నారు. ఉట్నూర్ ఏజెన్సీలోని జైనూర్ నార్నూర్, సిర్పూర్ యు, గాదిగూడ, లింగాపూర్ మండలాలకు చెందిన ప్రజలు వైద్యం కోసం వస్తుంటారని వారికి సకాలంలో వైద్య సేవలు అందించాలని అన్నారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. సాధారణ ప్రసవ వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.

- ఇంటర్ విద్యార్థుల కోసం చలివేంద్రం

ఉట్నూర్: మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌక్ ప్రాంతంలో ఇంటర్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ప్రారంభించారు. స్థానిక చైతన్య జూనియర్ కళాశాల సమీపంలో మెస్రం సోంజి వార్డెన్ జ్ఞాపకార్థం సామాజిక కార్యకర్త మెస్రం కేశవ్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమైన సందర్భంగా చలివేంద్ర ఏర్పాటు చేసి సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



ఉట్నూర్‌లో చలివేంద్రం ప్రారంభిస్తున్న బొజ్జుపటేల్

CLASSIFIEDS

WANTED

★ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనము. జీతం: 20k. Ph: 8977639662, 8977639663 AJH-14152

Classifieds
మీ అభిమాన ఆంధ్రజ్యోతి దినపత్రిక కల్పిస్తోంది ఒక చక్కటి అవకాశం
ప్రతి రోజు... క్లాసిఫైడ్స్



పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-
ఆదిలాబాద్ : 99854 11291, నిర్మల్ : 80966 77672